# ఉత్తర్‌ప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలోని సిఆర్‌పిఎఫ్ గ్రూప్ సెంటర్‌లో 4వ కోటి మొక్కను నాటనున్న కేంద్ర హోం మంత్రి, సహకార మంత్రి శ్రీ అమిత్ షా

న్యూఢిల్లీ, ఆగస్టు 18:కేంద్ర హోం మంత్రి, సహకార మంత్రి శ్రీ అమిత్ షా ఆగస్టు 18, 2023 శుక్రవారంనాడు ఉత్తర్‌ప్రదేశ్‌లోని గ్రేటర్ నోయిడాలో కేంద్ర రిజర్వు పోలీసు దళం (సిఆర్‌పిఎఫ్) గ్రూప్ సెంటర్‌లో 4వ కోటి మొక్కను నాటనున్నారు. సిఆర్‌పిఎఫ్‌కు చెందిన 8 భిన్న ఆవరణలలో కొత్తగా నిర్మించిన 15 అద్భుతమైన వివిధ రకాల భవనాలను హోం మంత్రి ఎలక్ట్రానిక్‌గా ప్రారంభించనున్నారు. దేశవ్యాప్తంగా ప్రత్యేకమైన ఈ భారీ, మానవీయ మొక్కలు నాటే డ్రైవ్‌ను హోం మంత్రి శ్రీ అమిత్ షా 12 జులై 2020న ప్రారంభించారు.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోడీ దార్శనికతో స్ఫూర్తిని పొంది, హోం మంత్రి, సహకార మంత్రి శ్రీ అమిత్ షా నాయకత్వంలో సిఆర్‌పిఎఫ్ 2020 నుంచి 2022 వరకు మూడేళ్ళ కాలంలో 3.55 కోట్లకు పైగా మొక్కలను దేశవ్యాప్తంగా నాటింది.

అన్ని కేంద్ర రిజర్వ్ పోలీసు దళాలు కలిసి 2023వ సంవత్సరానికి 1.5 కోట్ల మొక్కలను నాటాలన్నది లక్ష్యం.

దీనితో మొత్తం నాటిన మొక్కల సంఖ్య 5 కోట్లు కానుది. మొత్తం పర్యావరణ పరిరక్షణ కోసం దేశం చేస్తున్న కృషిలో ఇది సిఆర్‌పిఎఫ్ తరుపు నుంచి ఆదర్శప్రాయమైన సహకారం కానుంది.

భూమాతకు నిజమైన కృతజ్ఞతకు చిహ్నంగా కూడా ఉంటుంది.

నిర్దేశిత సెక్టార్లలో నాటడానికి తగిన జాతులపై టైమ్ టేబుల్‌ను రూపొందించి, దానికోసం ఒక నోడల్ అధికారిని నియమించారు.

సాధ్యమైనంతవరకు స్థానిక జాతులను నాటాలని, వేసే మొత్తం చెట్లలో కనీసం సగానికి పైగా 100 సంవత్సరాలు లేదా అంతకంటే ఎక్కువ జీవిత చక్రం ఉండే దీర్ఘకాలం ఉండే చెట్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అంతేకాకుండా, ఔషధ, పర్యావరణ అనుకూల చెట్లకు ప్రాధాన్యత ఇచ్చేలా జాగ్రత్తలు తీసుకున్నారు.

దేశ అంతర్గత భద్రతను కొనసాగించడం, దేశ ఐక్యతను, సమగ్రతను నిలబెట్టడం పట్ల తన నిబద్ధతకు కట్టుబడి ఉండటంతో పాటు, పర్యావరణ పరిరక్షణ, రక్షణ, సంక్షేమానికి అనుగుణంగా తమ భవిష్యత్ ప్రయత్నాలను సమలేఖనం చేయడంలో కేంద్ర సాయుధ పోలీసు బలగాలు తమ దృఢమైన అంకితభావాన్ని పునరుద్ఘాటించారు.

# 5జీ నెట్‌వర్క్‌లపై దాడులను నిరోధించడానికి సాఫ్ట్‌వేర్ పరిష్కారం

న్యూఢిల్లీ, ఆగస్టు 18:5జీ నెట్‌వర్క్‌లలో జీరో–డే ప్రమాదపు దాడులను ముందస్తుగా గుర్తించి నిరోధించగలిగేలా కొత్త స్వదేశీ సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ సొల్యూషన్ అందుబాటులోకి వచ్చింది. ఈ సాఫ్ట్‌వేర్ నెట్‌వర్క్ నిలిచిపోయే సమయాన్ని తగ్గిస్తుంది. సమీప భవిష్యత్తులో 5జీ నెట్‌వర్క్ జీవనరేఖగా మారడంతో ఇది దేశవ్యాప్తంగా కమ్యూనికేషన్‌ను సులభతరం చేయడంలో సహాయపడుతోంది. 5జీ సాంకేతికతలో దాదాపు తొంభై శాతం సాఫ్ట్‌వేర్ అనేక తాజా సాంకేతికతలను (ఎన్.ఎఫ్.వి, ఎస్.డి.ఎన్, కంట్రోల్ ప్లేన్/యూజర్ ప్లేన్ సెగ్రిగేషన్) సమగ్రపరచడం ద్వారా అమలు చేయబడుతుంది, ఇది సాంకేతికతను సులభంగా పరీక్షించడాన్ని అనుమతిస్తుంది. నెట్‌వర్క్ దాడి అవకాశం అనేక రెట్లు పెరిగింది. దీనిని మానవీయంగా నిర్వహించడం అసాధ్యం. దీనికి మొత్తం పరీక్ష ప్రక్రియను ఆటోమేట్ చేయడం మరియు నిరంతర పర్యవేక్షణ మాత్రమే సుస్థిరమైన పరిష్కారం. ప్రస్తుతం రన్ టైమ్ జీరో–డే వల్నరబిలిటీలలో ఎక్కువ భాగం దాడి తర్వాత గుర్తించబడ్డాయి, దీని వలన బ్రాండ్‌కు నష్టాన్ని సృష్టించడంతోపాటు రికవరీ ఖర్చు పెరుగుతుంది. ఐఐటీఎం మద్రాస్‌లోని ఐఐటీఎం ప్రవర్తక్ టెక్నాలజీస్ ఫౌండేషన్, సెన్సార్‌లు, నెట్‌వర్కింగ్, యాక్యుయేటర్స్ మరియు కంట్రోల్ సిస్టమ్స్ (ఎస్.ఎన్.ఎ.సి.ఎస్) కోసం టెక్నాలజీ ఇన్నోవేషన్ హబ్, ఇది నేషనల్ మిషన్ ఆన్ ఇంటర్ డిసిప్లినరీ సైబర్ ఫిజికల్ సిస్టమ్స్ (ఎన్ఎం–ఐ.సి.పి.ఎస్) కింద డిపార్ట్‌మెంట్ ఆఫ్ సైన్స్ అండ్ టెక్నాలజీ (డీఎస్టీ) మద్దతుతో ఉంది. దాని ఇంక్యుబేటెడ్ స్టార్టప్‌తో కలిసి 5జీ కోర్ నెట్‌వర్క్ ఫంక్షన్‌లు మరియు రేడియో యాక్సెస్ నెట్‌వర్క్ (ఆర్.ఎ.ఎన్) సాఫ్ట్‌వేర్ కోసం స్వదేశీ భద్రతా పరీక్ష పరిష్కారాన్ని అభివృద్ధి చేస్తోంది. ఈ టెక్నాలజీ సొల్యూషన్ ఫజ్ మరియు టెస్ట్ ఒరాకిల్స్ వంటి టెక్నిక్‌లను ఉపయోగించడం ద్వారా నెట్‌వర్క్‌లో జీరో–డే దుర్బలత్వాలను ముందుగానే గుర్తించగలదు. ఈ పరిష్కారం ఐఐటీఎం ప్రవర్తక్ యొక్క 5జీ సెక్యూరిటీ ల్యాబ్‌లో మాన్యువల్‌గా పరీక్షించబడింది. ఇది ముందస్తుగా దాడులను నివారించడంలో సహాయపడుతుంది కాబట్టి, ఇది సంస్థలు ఇలాంటి దాడులతో నష్టపోకుండా కాపాడుతుంది మరియు బ్రాండ్‌ల విశ్వసనీయతను కాపాడుతుంది. సిస్టమ్‌లోని దుర్బలత్వాలను కనుగొనడానికి బృందం నైతిక హ్యాకింగ్‌ను ఉపయోగించింది. నెట్‌వర్క్‌లోని కార్యాచరణ సమస్యను పరీక్షించారు, టోపోలాజీ, ఫీచర్ ఇంటరాక్షన్ మరియు 3జీపీపీ నిర్వచించిన 5జీ ప్రమాణాలను అనుసరించడం ద్వారా పాల్గొన్న నోడ్‌ల సంఖ్య ఆధారంగా వివిధ దాడి దృశ్యాలను సృష్టించారు. బృందం బహుళ–విక్రేత ఉత్పత్తులతో పరస్పర చర్య మరియు భద్రతా సమస్యలను పరీక్షిస్తోంది. నెట్‌వర్క్ ప్యాకెట్ స్థాయి, బైనరీ స్థాయి, కోడ్ స్థాయి మరియు కోడ్ వల్నరబిలిటీ స్కానర్‌లను ఉపయోగించి పరీక్షలు నిర్వహించబడతాయి. ఈ అన్ని పద్ధతుల కలయిక ప్రీ–ఎంప్షన్ మెకానిజం ద్వారా జీరో–డే దాడులను తగ్గించడంలో సహాయపడుతుంది. జీరో–డే దుర్బలత్వాలను తగ్గించడం వల్ల దాడి తీవ్రత తగ్గుతుంది, ఇది విమోచన చెల్లింపు అవసరాన్ని తగ్గిస్తుంది మరియు కమ్యూనికేషన్‌కు కీలకమైన 5జీ నెట్‌వర్క్‌ల నెట్‌వర్క్ డౌన్‌టైమ్‌ను కూడా తగ్గిస్తుంది.

# ఎస్సీ సంక్షేమ హాస్టల్ లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373వ జయంతి వేడుకలు

## – హాజరైన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామల్ల సత్యనారాయణ



ఖమ్మం, ఆగష్టు 18 (నేటినిజం ప్రతినిధి) :తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్, రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఎస్సీ సంక్షేమ హాస్టల్ ఎన్ఎస్పి క్యాంప్ లో ఆనంద నిలయంలో శ్రీశ్రీ సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ 373వ జయంతి ఉత్సవాలను టిఎస్ఎస్ఏ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించడం జరిగింది. జయంతి వేడుకకు హాజరైన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామల్ల సత్యనారాయణ, ఆనంద నిలయం హాస్టల్ వార్డెన్ రుక్మారావు ముందుగా సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ చిత్ర పటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ దామల్ల సత్యనారాయణ మాట్లాడుతూ...పూర్వపు వరంగల్, ప్రస్తుత జనగామ జిల్లా గల రఘునాథపల్లి మండలం ఖిలాషాపూర్ గ్రామంలో పాపన్న జన్మించారని, తండ్రి పేరు నాసగోని ధర్మన్నగౌడ్ అని పేర్కొన్నారు. చుట్టు పక్కల గ్రామస్తులు గౌరవంతో ధర్మన్నదొర అని పిలిచేవారని తెలిపారు. తండ్రి చిన్నతనంలోనే చనిపోయినగాని, అతని తల్లి సర్వమ్మ అలన పాలన చూసుకుందని తెలిపారు. తల్లి కోరిక మేరకు గౌడ వృత్తిని స్వీకరిరించిన పాపన్న గౌడ్ మొట్టమొదటి బహుజన వీరుడు, బహుజన చక్రవర్తి, బహుజన నాయకుడు, మన సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ అని తెలిపారు. సుమారు 370 సంవత్సరాల క్రితమే సమానత్వం గురించి పోరాడిన వ్యక్తిని, స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఆనంద నిలయం హాస్టల్ వార్డెన్ రుక్మారావు మాట్లాడుతూ...సర్దార్ సర్వాయి పాపన్నని ఆదర్శంగా తీసుకొని అందరు విద్యార్థులు క్రమశిక్షణగా ఉండాలని ప్రతి ఒక్కవిద్యార్థి ఒక లక్ష్యంతో ముందుకు సాగాలని భవిష్యత్తు తరాలకు ఆదర్శంగా నిలిచేలా ఉండాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ సోషలిస్ట్ స్టూడెంట్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు పెరుమాళ్ళపల్లి నాగార్జున, ముదిగొండ డివిజన్ కార్యదర్శి తోటమల్ల ఉదయ్, కల్లూరు డివిజన్ కార్యదర్శి సుధీర్, సంక్షేమ హాస్టల్ సిబ్బంది, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

# కలెక్టరేట్ లో సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతి వేడుకలు



కామారెడ్డి, ఆగష్టు 18: సర్వాయి పాపన్న జయంతి సందర్భంగా శుక్రవారం బి.సి.అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో అధికారికంగా కలెక్టరేట్ ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ నాటి పాలకుల అరాచకాలను అణిచి వేసేందుకు పుట్టిన బహుజన వీరుడు సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ అని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. మహనీయులు ఏ ఒక్క కులం కోసం కాకుండా అందరి కోసం పాటుపడ్డారని అన్నారు. సర్దార్ సర్వాయి పాపన్న ఆనాటి పాలకుల అరాచకాలను అణిచివేసి అణగారిన వర్గాల పేదల కోసం ప్రాణాలను సైతం ఫణంగా పెట్టి పోరాడారని గుర్తు చేశారు.

అన్నివర్గాల వారు రాజ్యాధికారంలో భాగస్వామ్యం కావాలని, ప్రజాస్వామిక స్ఫూర్తితో పోరాడడం గొప్ప విషయమని కొనియాడారు.

ప్రతిఒక్కరూ వారి ఆశయాలను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈసందర్భంగా గీతా కార్మికులకు కూడా బీసీ బంధు వర్తింపజేయాలని గౌడ సంఘం నాయకులు కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ అభివృద్ధి అధికారి శ్రీనివాస్, ఆబ్కారీ అధికారి రవీంద్ర రాజు, సీపీఓ రాజారామ్, డీపీఆర్ఓ శాంతి కుమార్, జడ్పీటీసీ తీగల తిరుమల గౌడ్, బీసీ సంఘాల నాయకులు బాలార్జున్ గౌడ్, గోపిగౌడ్, మహేష్ గౌడ్, శివరాం, నాగభూషణం, తదితరులు పాల్గొన్నారు.

# కొత్త వేరియంట్‌ను గుర్తించిన అమెరికా వ్యాధి నియంత్రణ కేంద్రం

## – ఈ వేరియంట్‌కు బీఏ.2.86 (ఃం.2.86)గా నామకరణం

డిల్లీ ఆగష్టు 18 (ఎక్స్ ప్రెస్ న్యూస్);గత మూడేళ్లుగా ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా వైరస్ మహమ్మారి ప్రస్తుతం అదుపులోనే ఉంది. భారత్ లో రోజూవారి కొత్త కేసుల్లో పెరుగుదల లేకపోవడంతో అంతా ఊపిరిపీల్చుకుంటున్నారు. దీంతో ప్రజలు సాధారణ జీవితాన్ని కొనసాగిస్తున్నారు. ఈ తరుణంలో కరోనా కొత్త వేరియంట్లు మరోసారి ఆందోళన కలిగిస్తున్నాయి. ఇప్పటికే ఈజీ. 5 వేరియంట్ అమెరికా, బ్రిటన్ సహా పలు దేశాల్లో వెలుగులోకి రాగా.. తాజాగా అమెరికాలో మరోకొత్త వేరియంట్‌ను అధికారులు గుర్తించారు.కొవిడ్ 19కి చెందిన అత్యంత పరివర్తన చెందిన కొత్త వేరియంట్‌ను గుర్తించినట్లు అమెరికాకు చెందిన వ్యాధి నియంత్రణ కేంద్రం తెలిపింది. ఈ వేరియంట్‌కు బీఏ.2.86 (ఃం.2.86)గా పేరు పెట్టినట్లు పేర్కొంది. ఈ కొత్త వేరియంట్ అమెరికాతోపాటు ఇజ్రాయెల్, డెన్మార్క్ దేశాల్లో కూడా వెలుగులోకి వచ్చినట్లు తెలిపింది.కొవిడ్–19కి చెందిన కొత్త వేరియంట్‌ను కనుగొన్నాం. దీనికి బీఏ.2.86 అని పేరు పెట్టాం. ఈ కొత్త వైరస్ యునైటెడ్ స్టేట్స్, డెన్మార్క్, ఇజ్రాయెల్‌లో కనుగొనబడింది. కొత్త వేరియంట్‌కు చెందిన పూర్తి సమాచారాన్ని సేకరిస్తున్నాం' అని అమెరికా వ్యాధి నియంత్రణ కేంద్రం తెలిపింది.మరోవైపు కొత్త వేరియంట్‌పై ప్రపంచ ఆరోగ్య సంస్థ (చిఉఖా) కూడా స్పందించింది. బీఏ.2.86 అధిక సంఖ్యలో ఉత్పరివర్తనలు కలిగి ఉన్నందున దానిని 'పర్యవేక్షణలో ఉన్న వేరియంట్' గా పేర్కొన్నట్లు తెలిపింది. ఈ రకానికి చెందిన సీక్వెన్స్‌లు కొన్ని దేశాల్లో వెలుగు చూసినట్లు వెల్లడించింది.ప్రపంచ ఆరోగ్య సంస్థ డేటా ప్రకారం.. కొవిడ్–19 (అనీలతిట–19)కి కారణమయ్యే వైరస్ ాంఖీా–అనీఎ–2తో సహా అన్ని వైరస్‌లు కాలక్రమేణా మారుతూ ఉంటాయి. అయితే, ఆ మార్పులు వైరస్ లక్షణాలపై ఎలాంటి ప్రభావం చూపవు. అయినప్పటికీ, వైరస్ ఎంత వేగంగా వ్యాప్తి చెందుతుంది, వ్యాధి తీవ్రత, వ్యాక్సిన్‌లు, చికిత్సా ఔషధాల పనితీరు వంటి కొన్ని మార్పులు వైరస్ లక్షణాలను ప్రభావితం చేయొచ్చు.

# రఘుమారెడ్డిని సన్మానించిన ఓరుగంటి వెంకటేష్



హైదరాబాద్, ఆగష్టు 18:కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం నూతన పాలక మండలి సభ్యులు నల్ల రఘుమారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం దేవాలయంలో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అభినందించారు. కర్మన్ ఘాట్ హనుమాన్ దేవాలయం నూతన కమిటీ సభ్యుడిగా ఎన్నికైన నల్ల రఘుమారెడ్డిని రాష్ట్ర బారాస నాయకులు ఓరుగంటి వెంకటేష్ గౌడ్ శాలువాతో సన్మానించి స్వీట్ తినిపించి శుభాకాంక్షలు తెలిపారు.

పాలకమండలి సభ్యులు సోమవారం ఉదయం ప్రమాణ స్వీకారం చేయనున్నట్లు ఈ సందర్భంగా నల్ల రఘు మారెడ్డి తెలిపారు. పాలకమండలి సభ్యులు ప్రమాణ స్వీకారం చేసిన పది రోజుల తర్వాత చైర్మన్ ఎన్నిక ఉంటుంది, చైర్మన్ గా నల్ల రఘుమారెడ్డి ఎన్నిక లాంచనమేనన్నారు. ఈ కార్యక్రమంలో ధర్మకర్తలుగా నియమితులైన బిళ్ళ కంటి కిరణ్ కుమార్ గుప్తా, మేక సురేందర్ రెడ్డి, చీర తిరుమలేష్, గోగిరెడ్డి అంజిరెడ్డి, గూడూరు మధుసూదన్ రెడ్డి, బిస్కుంట్ల సతీష్ గౌడ్ తదితరులు ఆంజనేయ స్వామిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా శుభాకాంక్షలు తెలిపిన వారిలో డివిజన్ అధ్యక్షులు ముడుపు రాజ్ కుమార్ రెడ్డి, బొంబాయి, వసంత రెడ్డి, ఉమామహేశ్వర్, గౌరీదేవి రాజు, నిశికాంత్ రెడ్డి, గౌతమ్ రెడ్డి తదితరులున్నారు.

# ఇంద్రకీలాద్రిపై శ్రావణమాస సందడి



అమరావతి, ఆగష్టు 18: విజయవాడలో ఇంద్రకీలాద్రిపై శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వారి దేవస్థానంలో కొలువుదీరిన అమ్మ వారి ఆలయంలో శ్రావణమాసం సందడి నెలకొంది. శ్రావణ మాసం తొలి శుక్రవారం కావడంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మొదటి శుక్రవారం పెద్ద సంఖ్యలో అమ్మవారి ఆలయానికి భక్తులు పోటెత్తారు. శ్రావణ మాసం మొదటి వారం నుండే వరలక్ష్మీ వ్రతాన్ని ఆచరించుకొని అమ్మవారి దర్శనానికి భక్తులు పెద్ద ఎత్తున వస్తున్నారు. కృష్ణానది తీరాన ఇంద్రకీలాద్రిపై కొలువుదీరిన శ్రీ కనకదుర్గమ్మ దేవస్థానంలో శ్రావణమాసాన్ని పురస్కరించుకుని అత్యంత వైభవంగా పూజలు జరుగుతున్నాయి.

దుర్గమ్మను దర్శించుకోవాలనే ఆనందంతో భక్తులు అమ్మవారి సన్నిధికి వస్తున్నారని దేవస్థానం ఈవో భ్రమరాంబ చెప్పారు. పెద్దఎత్తున తరలి వచ్చే భక్తుల కోసం అవసరమైన అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. శ్రావణమాసం ఈనెల 28వ తేదీన వరలక్ష్మీ వ్రతంను పురస్కరించుకుని ప్రత్యేకంగా కుంకుమార్చనలు నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. ఈనెల 30, 31, సెప్టెంబర్ ఒకటో తేదీన అమ్మ వారి సన్నిధిలో పవిత్ర మహోత్స వాలు అంగరంగ వైభవంగా నిర్వహి స్తున్నామని పేర్కొన్నారు. శ్రావణ మా సాన్ని ఎంతో పవిత్రమైన మాసంగా భక్తులు భావిస్తారు. మహిళలు ఈ మాసం అత్యంత శుభ ప్రదమైనదిగా భావించి నోములు, వ్రతాలు నోచుకుని, అమ్మవారికి ప్రత్యేక పూజలు చేస్తుంటారని వైద్య కమిటీ సభ్యులు శివప్రసాద్ శర్మ తెలిపారు. ఇక పెళ్లిళ్లు తదితర శుభకార్యాలకు ఇది దివ్యమైన మాసం శ్రావణమాసం అన్నారు. ఈనెల రోజులు నగరంలో పండుగ వాతావరణం సంతరించుకుంటుంది.

# పేలిన గ్యాస్ సిలిండర్- ఐదుగురికి గాయాలు

అమరావతి, ఆగష్టు 18:నంద్యాల జిల్లా అవుకు మండలంలోని రామాపురం గ్రామంలో ప్రమాదవశాత్తు గ్యాస్ సిలిండర్ పేలి ఐదుగురికి గాయాలయ్యాయి. వీరిలో ముగ్గురికి గాయాలు కాగా, ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. ఇంట్లో గ్యాస్ సిలిండర్ పేలడంతో ఇంటి గోడలు కూలాయి. వెంటనే గమనించిన కాలనీ వాసులు 108కు సమాచారం ఇవ్వడంతో క్షతగాత్రులను చికిత్స నిమిత్తం హుటాహుటిన బనగానపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# హైవేలపై తిరిగే ఆటోలు, తుఫాన్లు, మ్యాక్సీ క్యాబ్ లలో ప్రయాణికుల ఓవర్ లోడింగ్ నియంత్రించాలి

-బస్సు ప్రయాణం సురక్షితమని అవగాహన కల్పించాలి

-పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకోరాదు

-బస్ ట్రాకింగ్ యాప్ "గమ్యం" పై అవగాహన కల్పించాలి – జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి, ఆగస్టు 18(నేటినిజం ప్రతినిధి):జిల్లాలో హైవేల పై తిరిగే ఆటోలు, తుఫాన్లు, మ్యాక్సీ క్యాబ్ లు పరిమితికి మించి ప్రయాణికులను తీసుకెళ్లడాన్ని అరికట్టి ప్రమాదాలను నివారించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ అన్నారు. గురువారం కలెక్టరేట్లోని తన ఛాంబర్ లో కలెక్టర్ అధ్యక్షతన అక్రమ ప్రజా రవాణాపై జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జరిగింది. ప్రయాణికులు సురక్షితంగా ప్రయాణించడంపై చర్చించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రవాణా, టి ఎస్ ఆర్ టి సి, పోలీస్ శాఖలు అక్రమ ప్రజా రవాణా వాహనాలపై రైడ్స్ కొనసాగించాలన్నారు. అక్రమ వాహనాలను సీజ్ చేయాలని జిల్లా రవాణా డిప్యూటీ కమిషనర్ కు సూచించారు. చెక్క పలకలతో ఆటోలో సీట్లను పొడిగించుకోకుండా చూడాలన్నారు. హైవేల పై తిరిగే ఆటోలు, తుఫాన్లు, మ్యాక్సీ క్యాబ్ లలో ప్రయాణికులను ఓవర్ లోడింగ్ చేయడాన్ని రవాణా శాఖ అనుమతించకూడదన్నారు. బస్ స్టేషన్లకు 500 మీటర్ల దూరంలో నిలిపి ఉంచిన అక్రమ వాహనాలపై పోలీసు శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. వైట్ నంబర్ ప్లేట్ నమోదు చేసిన నాలుగు చక్రాల వాహన యజమానులు, ప్రయాణికులను తీసుకువెళ్లే డ్రైవర్లపై చర్యలు తీసుకోవాలని, అలాంటి వాహనాలను సీజ్ చేయాలన్నారు. సొంత వాహనాలలో అక్రమంగా ప్రయాణికులను చేరవేయవద్దని సూచించాలని తెలిపారు. సీటింగ్ కెపాసిటీ మించి అక్రమ వాహనాలలో ప్రయాణించి ప్రమాదాల బారిన పడకుండా, టి ఎస్ ఆర్ టి సి బస్సులలో ప్రయాణం సురక్షితమైనదని ప్రజలకు విస్తృతంగా అవగాహన కలిగేలా ఆయా ఆటో స్టాండ్స్, ప్రజా రవాణా వాహనాల ఏరియాలలో ఫ్లెక్సీలు, బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. రోడ్డు వారీగా షెడ్యూల్ తయారు చేసి దాని ప్రకారం ఆర్టిసి ,ఆర్టిఏ, పోలీస్ శాఖలు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని సూచించారు. బస్ ట్రాకింగ్ యాప్ "గమ్యం" పై అవగాహన కల్పించాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. ఈ



సమావేశంలో అదనపు ఎస్పి అశోక్, డిటిసి శివలింగయ్య,ఆర్టీసీ రీజినల్ మేనేజర్ సుదర్శన్, డిప్యూటీ రీజినల్ మేనేజర్ దైవాధీనం, టి ఎస్ ఆర్ టి సి వి అండ్ ఎస్ ఓ మహంకాళి రాంమూర్తి, సంగారెడ్డి డిపో మేనేజర్ ఉపేందర్ పాల్గొన్నారు.

# గృహలక్ష్మి పథకంలో వచ్చిన దరఖాస్తుల వెరిఫికేషన్ పూర్తి చేయాలి - జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి, ఆగస్టు 18(నేటినిజం ప్రతినిధి): గృహలక్ష్మి పథకంలో వచ్చిన దరఖాస్తులను ఆయా టీమ్స్ క్షేత్ర పరిధిలో వెరిఫికేషన్ పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో గృహలక్ష్మి, దళిత బంధు, బిసి, మైనార్టీ బంధు, కారుణ్య నియామకాలు, జీవో 58, 59 పురోగతి, ఆయిల్ ఫాం సాగు, జిపి భవన నిర్మాణాల పురోగతి, స్వీప్ కార్యక్రమాలు తదితర అంశాలపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటివరకు వచ్చిన గృహలక్ష్మి దరఖాస్తులను క్షేత్ర పరిధిలో పరిశీలన పూర్తి చేయాలన్నారు. అర్హుల దరఖాస్తులను సంబంధిత యాప్ లో అప్లోడ్ చేయాల్సి ఉంటుందన్నారు. రెండవ విడత దళిత బంధుకు అర్హుల జాబితాను అప్లోడ్ చేయాలన్నారు. బీసీ కులవృత్తులకు లక్ష రూపాయల ఆర్థిక సాయం కు రెండవ విడతలో నియోజకవర్గానికి 300 మంది లబ్ధిదారుల చొప్పున అర్హుల జాబితా లను సిద్ధం చేయాలన్నారు. జాబితాలు ఆమోదం పొందిన వెంటనే పంపిణీకి ఏర్పాట్లు చేయాలన్నారు. ఈనెల 19న మైనార్టీ లకు లక్ష రూపాయల ఆర్థిక సాయం పంపిణీకి సిద్ధం చేయాలని సంబంధిత అధికారికి సూచించారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల వారి గా లబ్ధిదారులకు పంపిణీ చేయాల న్నారు. రెండవ విడత జిల్లా లక్ష్యం మేరకు గొర్రెల పంపిణీకి చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారికి సూచించారు. రెండవ విడతలో ఇప్పటి వరకు 487 యూనిట్లను లబ్ధిదారులకు అందించామన్నారు. స్వతంత్ర వజ్రోత్సవాల ముగింపు కార్యక్రమంలో భాగంగా జిల్లాలో 6.20 లక్షల మొక్కలు నాటడానికి లొకేషన్స్ గుర్తించాలని, గుంతలు తవ్వి సిద్ధం చేయడంతో పాటు మొక్కలు సిద్ధంగా పెట్టుకోవాలన్నారు. ఎక్కువ సంఖ్యలో సంపదవనాలు ఏర్పాటు చేయడం, ఎవెన్యూ ప్లాంటేషన్ పై దృష్టి సారించాలని సూచించారు. కారుణ్య నియామకాలను వేగవంతం చేయా లని, జీవో 58,59 వెరిఫికేషన్ పూర్తి కావాలని తెలిపారు. ఆయిల్ ఫామ్ సాగుకు జిల్లా టార్గెట్ మేరకు ఐదువేల ఎకరాల ను త్వరిత గతిన గుర్తించా లన్నారు. ఇప్పటివరకు 1254 ఎకరాలు గుర్తించడం జరిగిందన్నారు. గ్రామపంచాయతీ భవన నిర్మాణ పనులు వేగవంతంగా పూర్తి చేయాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. స్వీప్ కార్యక్రమాల్లో భాగంగా అన్ని మున్సిపాలిటీలు, గ్రామపంచాయ తీలలో అన్ని వర్గాల ప్రజలకు ఓటర్ నమోదు, ఓటు హక్కు వినియోగించుకోవడం పై అవగాహన కల్పించాలని తెలిపారు.

# బోనుకు చిక్కిన ఎలుగుబంటి

అమరావతి, ఆగష్టు 18:ఉమ్మడి కర్నూలు జిల్లాలోని శ్రీశైలం పరిధిలో గల శిఖరేశ్వరం సమీపంలో సంచరిస్తున్న ఎలుగుబంటిని అటవీశాఖ అధికారులు ఇవాళ ఉదయం పట్టుకున్నారు. గత రెండు రోజుల నుంచి శిఖరం సమీపంలో ఎలుగుబంటి సంచరించడంతో భక్తులు భయాందోళనకు గురవుతున్నారు. ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నారు.

తిరుపతిలో జరిగిన ఘటనల దృష్ట్యా శ్రీశైలంలో ముందస్తు చర్యలు తీసుకోవాలని సిబ్బందిని అధికారులు ఆదేశించారు. ఈ నేపథ్యంలో అటవీశాఖ అధికారులు అప్రమత్తమై ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు శిఖరేశ్వరం సమీపంలో మూడు బోన్లను ఏర్పాటు చేశారు. శ్రీశైలం పరిధిలో చిరుత కూడా సంచరించడంతో అధికారులు, భక్తులను అటవీశాఖ డిప్యూటీ డైరెక్టర్ అలాంగ్ చాంగ్ తెరాన్ అప్రమత్తం చేశారు. దీంతో ఎలుగుబంటి బోనులో చిక్కింది.

## ఈ నెల 19న జిల్లాలో 5కె రన్ ను విజయవంతం చేయాలి

## - జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్

సంగారెడ్డి, ఆగస్టు 18 (నేటినిజం ప్రతినిధి): భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఈ నెల 19న ఉదయం 6 గంటలకు జిల్లాలో ఐ ఓట్ ఫర్ షూర్ అనే నినాదంతో నిర్వహించనున్న 5కె రన్ ను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ కోరారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ సంగారెడ్డి కేంద్రంలో 19న ఉదయం 6 గంటలకు మహబూబ్ సాగర్ చెరువు వద్ద నుండి పి ఎస్ ఆర్ గార్డెన్స్ వరకు 5కె రన్ నిర్వహించడం జరుగుతుందన్నారు. అదేవిధంగా జిల్లాలోని అన్ని నియోజకవర్గాల పరిధిలో 5కె రన్ నిర్వహిస్తారన్నారు. ఆయా అధికారులు 5కె రన్ నిర్వహణ ఏర్పాట్లను సమన్వయంతో చేయాలని సూచించారు. 5కె రన్ కార్యక్రమంలో ఎన్నికల అధికారులు, సహాయ ఎన్నికల అధికారులు, అన్ని శాఖల అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులు, యువత, విద్యార్థినీ, విద్యార్థులు, ప్రజలు స్వచ్ఛందంగా పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కలెక్టర్ కోరారు.

# స్థానిక పేదలకే డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వాలి- ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్



హైదరాబాద్, ఆగష్టు 18:డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు స్థానికులకు,అర్హులైన నిరుపేదలకు,మహిళలకు ఇవ్వాలని ఉప్పల్ మాజీ ఎమ్మెల్యే ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ డిమాండ్ చేశారు.ఉప్పల్ నియోజకవర్గంలోని రామంతపూర్ లో బీజేపీ నాయకుల ఆధ్వర్యంలో ఆయన డబుల్ బెడ్ రూముల పంపిణీ కోసం 48 గంటల నిరసన ధర్నాచేపట్టారు.. ఈ సందర్భంగా ఎన్ వి ఎస్ ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ గత తొమ్మిదిన్నార సంవత్సరాల తెలంగాణ పాలనలో ఇదిగో డబుల్ బెడ్ రూమ్ అదిగో డబుల్ బెడ్ రూమ్ అంటూ మభ్యపెడుతూ పబ్బం గడుపుకుంటూ ఓట్లు దండు కుంటున్నారు తప్పా ఏ ఒక్క నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ లు అందలేదని ఆరోపించారు.. తాను ఎమ్మెల్యే గా ఉన్నప్పుడు ఉప్పల్ నియోజకవర్గంలో కట్టిన డబుల్ బెడ్ రూమ్ లు పేద ప్రజలకు ఇవ్వకుండా వారి జీవితాలతో చెలగాటం ఆడుతు న్నాంటూ మండిపడ్డారు. .కట్టిన డబుల్ బెడ్ రూమ్ లు కూడా లంచాలు తీసుకొని స్థానికులకు ఇవ్వడం లేదని ఆరోపించారు. ఈ నిరసన ధర్నా లో బీజేపీ నాయకులు ,మహిళలు భారీగా పాల్గొన్నారు.

# డబుల్ బెడ్రూమ్ ల పేరుతో పేదలను మభ్య పెడుతోన్న ప్రభుత్వం: సామ రంగారెడ్డి

హైదరాబాద్, ఆగష్టు 18:డబుల్ బెడ్రూమ్ ల పేరుతో బీఆర్ఎస్ ప్రభుత్వం పేద ప్రజలను మభ్యపెడు తూ పబ్బం గడుపుతుందని బీజేపీ రంగారెడ్డి అర్బన్ జిల్లా అధ్యక్షుడు సామ రంగారెడ్డి ఆరోపించారు. బీజేపీ రాష్ట్ర పార్టీ ఆదేశాల మేరకు అర్హులైన పేదలందరికి డబుల్ రూమ్ లు కేటాయించాలని శుక్రవారం ఎల్.బి నగర్ లో కార్పొరేటర్లు పార్టీ కార్యకర్తలతో కలిసి చింతలకుంట వియజయవాడ జాతీయ రహదారిపై బీఆర్ఎస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ఆందోళన చేపట్టి రాస్తారోకో నిర్వహించారు.

ఈ సందర్భంగా సామ రంగారెడ్డి మాట్లాడుతూ? గత 9 సంవత్సరాలుగా పేదలకు డబుల్ బెడ్రూమ్ ల కేటాయింపులో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని మండిపడ్డారు. వేలల్లో డబల్ బెడ్రూముల కోసం దరఖాస్తు చేసుకోగా కేవలం వందలలో నిర్మించారన్నారు. అవి కూడా బారాస కార్యకర్తలకు, స్థానిక ఎమ్మెల్యే అనుచరులకు కట్టబెట్టారన్నారు. ఈ మోసపూరిత ప్రభుత్వాన్ని గద్దె దింపడం బీజేపీ కే సాధ్యమన్నారు. విజ్ఞులైన ప్రజలు రాబోయే కాలంలో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. బీజేపీ నేతల ఆందోళనతో 3 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జాం అవ్వడంతో పోలీస్ లు వచ్చి నాయకులను అరెస్ట్ చేసి హయత్ నగర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. ఈ ఆందోళనలో కళ్లెం నవ జీవన్ రెడ్డి, కొత్త రవీందర్ గౌడ్, వనపల్లి శ్రీనివాస్ రెడ్డి, విజయ్ కుమార్, శ్యామల, కృష్ణవేణి, సామ ప్రభాకర్ రెడ్డి, అంజాన్ కుమార్ గౌడ్, చెక్క అశోక్ కుమార్, రాకేష్ యాదవ్, కవిత రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# రెండవ రోజు సినిమా తిలకించిన 5955 మంది విద్యార్థులు - జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్



సంగారెడ్డి, ఆగష్టు 18(నేటినిజం ప్రతినిధి): మహాత్మా గాంధీ చలనచిత్రం ఉచిత ప్రదర్శనలో భాగంగా రెండవ రోజు జిల్లాలో 5,955మంది విద్యార్థులు చలన చిత్రాన్ని వీక్షించి నట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ శరత్ గురువారం నాడు ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం జిల్లాలోనీ (11) సినిమా థియేటర్లల లో సినిమాను ప్రదర్శించడం జరిగిందని తెలిపారు. సంగారెడ్డి లోని సితార థియేటర్లో (500) మంది విద్యార్థులు, నటరాజ్ థియేటర్లో (450) మంది విద్యార్థులు, రుక్మిణి థియేటర్లో (460) మంది , జహీరాబాద్ లోఎస్ వి సినీ మాక్స్ థియేటర్ లో (305) మంది, శ్రీ మోహన్ టాకీస్ లో (750), మహేశ్వరి థియేటర్ లో ( 750 ) మంది, నారాయణఖేడ్ లోని శ్రీ వెంకటేశ్వర థియేటర్ లో ( 530 ) మంది, పటాన్చెరు శివరంజని డీలక్స్ లో(520 ) మంది, ఎస్ వి సినీ స్క్వేర్ థియేటర్లో (660) మంది, సదాశివపేట మహేశ్వరి థియేటర్ లో(510),జ్యోతిలో (520) మంది విద్యార్థులు గాంధీ చలనచిత్రాన్ని తిలకించారని కలెక్టర్ పేర్కొన్నారు.

# ప్రభుత్వంలో ఆర్టీసీ విలీనం చారిత్రాత్మకం : మంత్రి జగదీష్‌రెడ్డి



సూర్యాపేట, ఆగష్టు 18: ముఖ్యమంత్రి కేసీఆర్ టీఎస్ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయడం చారిత్రాత్మక నిర్ణయమని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీష్ రెడ్డి అన్నారు. సూర్యాపేట డిపోలో శుక్రవారం ఆర్టీసీ కార్మికులు నిర్వహించిన ఆత్మీయ సమ్మేళనంలో మంత్రి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా డిపో ఆవరణ లో విశ్రాంత ఉద్యోగుల కోసం నిర్మించనున్న భవనానికి శంకుస్థాపన చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ కార్మికులను ఉద్యోగస్తులుగా మార్చిన ఘనత సీఎం కేసీఆర్ కు మాత్రమే దక్కుతుందని అన్నారు. మాట ఇస్తే మడమ తిప్పని నేత కేసీఆర్ తోనే ఆర్టీసీ కార్మికుల ఆకాంక్షలు నెరవేర నున్నాయని మంత్రి పేర్కొన్నారు. ప్రజల కష్ట, నష్టాలు తెలిసిన కార్మిక పక్షపాతి కేసీఆర్ అని పేర్కొన్నారు. ఆర్టీసీ, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటు పరం చేసేందుకు చంద్రబాబు , ప్రపంచ బ్యాంక్ షరతు లకు భయపడి నోరు మెదపని కాంగ్రెస్ ప్రయత్నాలను అడ్డుకుంది కేసీఆర్ యేనని వెల్లడించారు. నరేంద్ర మోదీ పాలనలో ప్రభుత్వ రంగ సంస్థలు నిర్వీర్యం అయ్యాయని ఆరోపించారు. ఎల్ఐసీ , విద్యుత్ రంగాన్ని, ఇతర ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు పరానికి బీఆర్ఎస్ పూర్తి వ్యతిరేకమని స్పష్టం చేశారు. కేసీఆర్ కు అండగా నిలువాలని ఆర్టీసీ ఉద్యోగులను, కార్మికులు, సిబ్బందికి పిలుపునిచ్చారు.

# కూకట్‌పల్లిలో ఎంజీ మోటార్స్..

హైదరాబాద్, ఆగష్టు 18: కూకట్‌పల్లిలో మోరీస్ గ్యారేజెస్ (ఎంజీ) మోటార్స్ కార్ షోరూం అట్టహాసంగా ప్రారంభమైంది. నగరంలో ఉన్న ఎంజీ కార్ షోరూమ్‌ల సరసన మూసాపేట గోద్రెజ్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన ఎంజీ మోటార్స్ కార్ షోరూం వచ్చి చేరింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంజీ డిప్యూటీ మేనేజింగ్ డైరెక్టర్ గౌరవ్ గుప్తా హాజరై ప్రారంభించారు. అనంతరం షోరూమ్ లో జ్యోతి ప్రజ్వలన చేసి నగరంలో 9వ షోరూమ్ నిర్వహణను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎంజీ కార్లు సాంకేతిక సామర్థ్యంతో పని చేస్తాయని తెలిపారు. ఎంజీ కార్లలో పూర్తిగా సంకేతికత అందుబాటులో ఉండటంతో క్రేజ్ పెరుగుతుందన్నారు. దీంతో మార్కెట్‌లో ఎంజీ కార్లకు మరింత డిమాండ్ పెరిగడంతో బుకింగ్‌లు కూడా అదే స్థాయిలో పెరిగాయన్నారు. రాబోయే కాలంలో ఎంజీ కార్లు నంబర్. 1 స్థానంలోకి రావడం ఖాయమన్నారు.






# నాణ్యత ప్రమాణాలతో పనులు చేపట్టాలి.. కార్పొరేటర్ సుజాత నాయక్



హైదరాబాద్, ఆగష్టు 18: అభివృద్ధి పనులు నాణ్యతా ప్రమాణాలతో చేవట్టాలని హస్తినాపురం కార్పొరేటర్ బానోత్ సుజాత నాయక్ అధికారులను ఆదేశించారు. డివిజన్ పరిధిలోని అగ్రికల్చర్ కాలనీలో శుక్రవారం కార్పొరేటర్ భానోత్ సుజాత నాయక్ పర్యటించి అక్కడ సుమారు కోటి రెండు లక్షలతో జరుగుతున్న బీటీ రోడ్డు పనులను కాలనీ వాసులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ అభివృద్ధి పనులు నాణ్యత ప్రమాణాలు పాటించి త్వరితగతిన పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అసిస్టెంట్ ఇంజనీర్ హేము నాయక్ ను ఆదేశించారు.

ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ? కాలనీలో మిగిలి ఉన్న రోడ్లలో సీసీ రోడ్లు బీటీ రోడ్లు మంజూరయ్యేలా కృషి చేయాలని కార్పొరేటర్ ని కాలనీవాసులు కోరారు. స్పందించిన కార్పొరేటర్ మాట్లాడుతూ రాబోయే రోజుల్లో జిహెచ్ఎంసి నిధులతో రోడ్లకు అవసరమయ్యే నిధులను మంజూరు చేయిస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు తాండ్ర మహిపాల్ రెడ్డి, పి ఎస్ ఆర్ శర్మ బాలకృష్ణారెడ్డి, నాగరాజు, మెగా రెడ్డి, జితేందర్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, వెంకటేష్, తివారి, రాము, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ నాయకులు గోపిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, మమతా మల్లేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

# పూరీలోని పెంతకట గ్రామాన్ని సందర్శించిన డాక్టర్ అభిలాక్ష్ లిఖి

న్యూఢిల్లీ, ఆగష్టు 18:కోస్తా ప్రాంతంలోని మత్స్యకారులు ఎదుర్కొంటున్న క్షేత్రస్థాయి సమస్యలను అర్థం చేసుకోవడానికి, వారి కోసం దీర్ఘకాలిక ప్రణాళికలను రూపొందించడానికి ఒడిశాలోని పూరీ జిల్లా తీరప్రాంత గ్రామమైన పెంటకటాను కేంద్ర ప్రభుత్వ మత్స్య శాఖ కార్యదర్శి డాక్టర్ అభిలాక్ష్ లిఖి సందర్శించారు. పెంటకటా వద్ద, డాక్టర్ లిఖి ప్రాథమిక మత్స్యకారుల సహకార సంఘం సభ్యులు (పీఎఫ్సీఎస్), మత్స్యకార జానపద మరియు మత్స్యకార మహిళలతో సంభాషించారు. వారి సామాజిక-ఆర్థిక స్థితిగతులను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా, మత్స్యకారులు వలలు, పడవలు మరియు డీజిల్ సబ్సిడీ తదితరాల కొనుగోలు కోసం కేంద్ర మరియు రాష్ట్ర ప్రభుత్వాల నుండి వివిధ పథకాల కింద అందుతున్న సహాయాన్ని గురించి తెలియజేశారు. పెంటకాటలోని మత్స్యకారులు ఫిష్ ల్యాండింగ్ సెంటర్/ జెట్టీ, హైజీనిక్ డ్రై ఫిష్ మార్కెట్, యు టవల్ ఛార్జీలకు సంబంధించిన కార్యకలాపాలను నిర్మించాలని డిమాండ్ చేశారు. మత్స్యకారుల డిమాండ్‌ను పరిశీలించి కేంద్ర, రాష్ట్ర పథకాల కింద ప్రభుత్వ సాయం అందించాలని ఒడిశా మత్స్యశాఖ డైరెక్టర్‌కు సూచించారు. ప్రధాన మంత్రి మత్స్య సంపద యోజన (పి.ఎం.ఎం.ఎస్.వై) కింద లబ్ధి పొందిన పూరీ జిల్లాలోని చేపల రైతులతో కూడా ఆయన సంభాషించారు. ఐసీఏఆర్- సెంట్రల్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఫిష్వాటర్ ఆక్వాకల్చర్ (సీఐఎఫ్ఏ) కౌసల్యగంగలో ఐసీఏఆర్ - సీఐఎఫ్ఏ మరియు ఎన్.ఎఫ్.డి.బి- నేషనల్ ఫ్రెష్ వాటర్ ఫిష్ బ్రూడ్ బ్యాంక్ (ఎన్.ఎఫ్.ఎఫ్.బి.బి) భువనేశ్వర్ నిర్వహిస్తున్న కార్యకలాపాలను సమీక్షించారు. కార్యక్రమానికి డాక్టర్ అభిలాక్ష్ లిఖి అధ్యక్షత వహించారు. ఒడిశా రాష్ట్రంలోని పీఎంఎంఎస్వై ప్రాజెక్టుల పురోగతిని కూడా ఆయన సమీక్షించారు. ఐసీఏఆర్ - సీఐఎఫ్ఏ డైరెక్టర్ డాక్టర్ ప్రమోద కుమార్ సాహూ ఐసీఏఆర్ - సీఐఎఫ్ఏలో జరిగిన పరిశోధన కార్యకలాపాలపై వివరణాత్మక ప్రదర్శనను అందించారు. జన్యుపరంగా మెరుగైన రోహు మరియు కాట్లా, జీఐ-స్కాంపి, జాతులు మరియు వ్యవస్థ వైవిధ్యం, ఆక్వాకల్చర్ రంగంలో కొత్త మరియు వినూత్న సాంకేతికతలు, వివిధ మంచినీటి చేప జాతులకు ఫీడ్ ఫార్ములేషన్‌లు, వ్యాధి నిర్ధారణలు మరియు చికిత్సా విధానాలు వంటి ఇన్‌స్టిట్యూట్‌ల విజయాలను డాక్టర్. సాహూ హైలైట్ చేశారు. రైతులు మరియు అనేక ఇతర వాటాదారుల నైపుణ్యాలను పెంపొందించడానికి పరిశోధన మరియు శిక్షణ కార్యక్రమాలను గురించి తెలియజేశారు. ఆక్వా రైతుల ప్రయోజనం కోసం సీఐఎఫ్ఏ అవసరాల ఆధారిత పరిశోధనలను నిర్వహించాలని మరియు పరిశ్రమ ప్రతి సంవత్సరం భారీ మొత్తంలో చేపల పంటను నష్టపోయే వ్యాధులపై ప్రత్యేక దృష్టి పెట్టాలని డాక్టర్ లిఖి ఈ సందర్భంగానొక్కి చెప్పారు. ఎన్.ఎఫ్.డి.బి-నేషనల్ ఫ్రెష్ వాటర్ ఫిష్ బ్రూడ్ బ్యాంక్ (ఎన్.ఎఫ్.ఎఫ్.బి.బి) అధికారులు తమ కార్యకలాపాలను గురించి వివరణసమర్పించారు. బ్రూడ్ బ్యాంక్ యొక్క లక్ష్యాలు, ఇప్పటివరకు సాధించిన విజయాలు మరియు ప్రస్తుత కార్యకలాపాల గురించి వివరంగా వివరించారు. జీఐ ఫిష్ స్ట్రెయిన్స్ (కార్ప్స్) యొక్క బ్రీడర్ సీడ్ యొక్క బ్రీడింగ్ మరియు ఉత్పత్తి కోసం ఎన్.ఎఫ్.డి.బి-ఎన్.ఎఫ్.ఎఫ్.బి.బి మల్టిప్లికేషన్ సెంటర్ మరియు జీఐ స్కాంపి కోసం సిమెంట్ నర్సరీ సౌకర్యాలను కలిగి ఉందని ఆయన తెలియజేశారు. చేపల పెంపకం మరియు విత్తనోత్పత్తి సాంకేతిక పరిజ్ఞానంపై శిక్షణ మరియు సామర్థ్యాన్ని పెంపొందించడం ద్వారా చేపల పెంపకందారుల నైపుణ్యాన్ని మెరుగుపరిచేందుకు కూడా అవకాశం ఉందని ఈ దిశగా చర్యలు చేపట్టడాన్ని ఆయన ప్రధానంగా తెలియజేశారు.. బయోఫ్లోక్ మరియు ఆర్ఏఎస్ వ్యవస్థలలో డిమాండ్ ఉన్న కొన్ని వాణిజ్యపరంగా ముఖ్యమైన చేపల రకాలను అభివృద్ధి చేయాలని డాక్టర్ లిఖి ఎన్.ఎఫ్.డి.బి-ఎన్.ఎఫ్.ఎఫ్.బి.బికి సలహా ఇచ్చారు. ఫిషరీస్ డైరెక్టర్, ఒడిశా ప్రభుత్వం, ఫిషరీస్ మరియు ఆక్వాకల్చర్ రంగంలో ఒడిశా సాధించిన విజయాలపై సంక్షిప్త ప్రదర్శనను అందించారు. చేపల ఉత్పత్తి, ఎగుమతి, దేశీయ వినియోగం మొదలైనవి పెరుగుతున్న ట్రెండ్‌లో ఉన్నాయని ఆయన హైలైట్ చేశారు. డా. లిఖి సీఐఎఫ్ఏ మరియు ఎన్.ఎఫ్.ఎఫ్.బి.బికి కార్యకలాపాలను సమీక్షిస్తూ, ఎగుమతిదారులు, ప్రగతిశీల రైతులు, మహిళా స్వయం సహాయక బృందం (డబ్ల్యుఎస్హెచ్జీలు) సభ్యులు, ఫిష్ ఫ్రేమర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ (ఎఫ్. ఎఫ్.పి.ఒ) సభ్యులతో కూడా సంభాషించారు. ప్రభుత్వం మరియు పరిశోధనా సంస్థల నుంచి ఈ రంగం ప్రాధాన్యతలు మరియు అకాంక్షలను గురించి తెలియజేశారు. ఎలక్ట్రానిక్ /ప్రింట్ మీడియా, సోషల్ మీడియా, అలాగే కిసాన్ మేళాలు, పబ్లికేషన్‌లు, సెమినార్‌లు, అడ్వైజరీల ద్వారా ఈ రంగంలోని వాటాదారులందరి ప్రమేయంతో రైతులకు పెద్దఎత్తున అవగాహన కల్పించేందుకు సీఐఎఫ్ఏ మరియు ఎన్.ఎఫ్.ఎఫ్.బి.బికి చర్యలు చేపట్టాలని కార్యదర్శి కోరారు. తద్వారా అభివృద్ధి చెందిన సాంకేతికత మరియు బెస్ట్ మేనేజ్‌మెంట్ పద్ధతులు (బీఎంపీలు) రైతులకు వీలైనంత త్వరగా చేరతాయి, తద్వారా రైతులు పథకాలు మరియు కొత్త సాంకేతికత యొక్క ప్రయోజనాన్ని పొందవచ్చు. డాక్టర్ లిఖి ఐసీఏఆర్ - సీఐఎఫ్ఏలోని బయోఫ్లోక్ యూనిట్, జీఐ-స్కాంపి కాంప్లెక్స్, అలంకార చేపల సముదాయం మరియు గాలి పీల్చే ఫిష్ యూనిట్ వంటి సౌకర్యాలను సందర్శించారు. ఎన్.ఎఫ్.ఎఫ్.బి.బి. యొక్క మల్టిప్లికేషన్ ఫెసిలిటీ, స్కాంపి నర్సరీ పెంపకం సౌకర్యాన్ని కూడా సందర్శించారు. ఒడిశాలోని కౌసల్యగంగలోని ఎన్.ఎఫ్.ఎఫ్.బి.బి లో అభివృద్ధి చేసినజ జీఐచేప జాతులను వీక్షించారు.

# నూతన పంచాయతీరాజ్ చట్టంతో పల్లెల వికాసం - మంత్రి వేముల



నిజామాబాద్, ఆగష్టు 18:నూతన పంచాయతీరాజ్ చట్టం అమలుతో తెలంగాణ పల్లెలన్నీ వికాసాన్ని సంతరిం చుకుంటున్నాయని రాష్ట్ర రోడ్లు-భవనాల శాఖా మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి అన్నారు. నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గంలోని 60 మంది జూనియర్ పంచాయతీ కార్యదర్శులను గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా రెగ్యులర్ చేస్తూ ప్రభుత్వం జారీ చేసిన నియామక ఉత్తర్వులను మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి శుక్రవారం మోర్తాడ్ మండలంలోని రైతు వేదికలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ప్రభుత్వం పంచాయతీరాజ్ వ్యవస్థలో చేపట్టిన మార్పులతో తెలంగాణ పల్లెలు సర్వతో ముఖాభివృద్ధి దిశగా పరుగులు పెడుతున్నాయని అన్నారు. గ్రామ పంచాయతీలను వికేంద్రీకరిస్తూ జవాబుదారీతనం పెంచాలనే ఉద్దేశంతో ప్రభుత్వం జూనియర్ పంచాయతీ కార్యదర్శులను నియమించిందన్నారు.

దీర్ఘకాలిక ప్రయోజనాలను ఆశిస్తూ తెచ్చిన నూతన పంచాయతీ రాజ్ చట్టంతో గ్రామాలన్నీ వికాసాన్ని సంతరించుకొని యావత్ దేశం దృష్టిని ఆకర్షిస్తున్నాయని అన్నారు. ప్రతి పల్లెలో పచ్చదనం పెరిగి, ఇంటింటికి తడి పొడి చెత్త సేకరణ, కంపోస్టు షెడ్లు వంటి వసతులు అందుబాటులోకి వచ్చాయని గుర్తు చేశారు. గడిచిన యాభై సంవత్సరాలలో జరగని అభివృద్ధి, నూతన పంచాయతీరాజ్ చట్టంతో అతి స్వల్ప కాలంలోనే సాధ్యపడిందని మంత్రి తెలిపారు. జాతీయ స్థాయిలో తెలంగాణకు వరించిన అవార్డులే ఇందుకు నిదర్శనం అని అన్నారు. సమగ్ర ప్రగతి, సదుపాయాల కల్పన కొలమానంగా కేంద్రం దేశ వ్యాప్తంగా 20 ఉత్తమ గ్రామ పంచాయతీలను ఎంపిక చేయగా, అందులో 19 అవార్డులు తెలంగాణకే వరించాయని వివరించారు. వీటిలో నిజామాబాద్ జిల్లాలో ఐదు గ్రామ పంచాయతీలు, బాల్కొండ నియోజకవర్గంలోని ఒక గ్రామ పంచాయతీకి జాతీయ స్థాయిలో ఉత్తమ జీపీగా గుర్తింపు లభించడం జరిగిందన్నారు. ఈ విషయమై నీతి ఆయోగ్ లో సైతం చర్చ జరిగిందన్నారు. తెలంగాణలో నూతన పంచాయతీరాజ్ చట్టం అమలుతోనే పల్లెలు ప్రగతి దిశగా పయనిస్తూ అన్ని విధాలుగా అభివృద్ధిని సంతరించుకుంటున్నాయని స్వయంగా నీతి ఆయోగ్ వెల్లడించడం ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనా దక్షతకు తార్కాణం అని మంత్రి హర్షం వ్యక్తం చేశారు.

ప్రభుత్వ ఆశయానికి అనుగుణంగా పంచాయతీ కార్యదర్శుల కృషి, పట్టుదలతోనే పల్లెల వికాసం సాధ్యపడిందని, ఈ దిశగా స్థానిక ప్రజాప్రతినిధులు పూర్తిస్థాయిలో తోడ్పాటును అందించారని అభినందించారు. ప్రస్తుతం నాలుగేళ్ల సర్వీస్ ను పూర్తి చేసుకున్న జూనియర్ పంచాయతీ కార్యదర్శులను ప్రభుత్వం రెగ్యులరైజ్ చేస్తూ, గ్రేడ్-4 పంచాయతీ కార్యదర్శులుగా నియమించిన నేపథ్యంలో పల్లెల అభ్యున్నతి కోసం మరింత అంకిత భావంతో పని చేయాలని సూచించారు. నిస్వార్థంతో, నిజాయితీగా విధులు నిర్వర్తిస్తూ ప్రజలకు సమర్థవంతంగా సేవలందిస్తే, మంచి గుర్తింపు లభించడమే కాకుండా ఎంతో సంతృప్తి లభిస్తుందని అన్నారు.

ఈ కార్యక్రమంలో జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, ఎంపీపీ శివలింగు శ్రీనివాస్, జెడ్పీటీసి రవి, డీసీసీబీ వైస్ చైర్మన్ రమేష్ రెడ్డి, డీఎల్పీఓ శ్రీనివాస్, సర్పంచ్ భోగ ధరణి ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ పంచాయతీ కార్యదర్శులకు పదోన్నతులు.

భీమ్‌గల్ మండలంలో జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా పనిచేస్తున్న 18 మందికి గ్రేడ్ 4 పంచాయతీ కార్యదర్శులుగా పదోన్నతి ప్రభుత్వం కల్పించింది. ఈ మేరకు శుక్రవారం మోర్తాడ్ మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమం లో రాష్ట్ర రొడ్డు భవనాల శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి పదోన్నతి పొందిన 18 మందికి ధ్రువపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా పదోన్నతి పొందిన కార్యదర్శులు మాట్లాడుతూ ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు విజయవంతం చేసేందుకు మరింత కృషి చేస్తామని పేర్కొన్నారు. ప్రభుత్వం ఇచ్చిన మాట మేరకు పదోన్నతి కల్పించినందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రశేఖర్ రావు, రొడ్డు భవనాలు శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమం లో ఎంపీడీఓ రాజేశ్వర్, ఎంపీవో గంగమోహన్ తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీలకు ఉప ఎన్నికలు.. పకడ్బందీ ఏర్పాట్లు.. ఎస్పీ

అమరావతి, ఆగష్టు 18:: ఏలూరు జిల్లాలో జరిగే పంచాయతీ ఉప ఎన్నికలు ప్రశాంతంగా ముగిసేలాగా పటిష్టమైన భద్రతా చర్యలను చేపట్టినట్లు ఏలూరు జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి తెలిపారు. పోలింగ్ కేంద్రాలు, కౌంటింగ్ కేంద్రాల వద్ద పటిష్ట బందోబస్తు ఏర్పాట్లు చేసినట్లు పోలింగ్ కేంద్రాలకు 100మీటర్ల దూరం వరకు ఓటర్లకు తప్ప ఇతరులకు అనుమతి లేదన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఏ విధమైన ప్రచారాలు చేయరాదని, ఓటర్లు నిర్భయంగా స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని, ఓటర్లను భయభ్రాంతులకు గురి చేయడం కానీ, ప్రలోభాలకు గురి చేయడం కానీ చేసిన యెడల చట్టప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు.

పోలింగ్ రోజైన శనివారం ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు పోలింగ్ ప్రక్రియ జరుగుతుందన్నారు. కౌంటింగ్ ప్రక్రియ కూడా రేపు మధ్యాహ్నం 2 గంటల నుండీ నిర్వహించనున్నట్లు తెలిపారు. పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియల సందర్భంగా ఎలాంటి సంఘటనలకు ఆస్కారం లేకుండా తగిన జాగ్రత్తలు తీసుకున్నట్లు తెలిపారు. పోలింగ్ కేంద్రాల చుట్టుప్రక్కల ప్రాంతాల్లో 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. సమస్యాత్మక, అత్యంత సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద ప్రత్యేకమైన భద్రతా చర్యలు తీసుకుని ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ డి మేరీ ప్రశాంతి తెలిపారు.

